# సాక్షి విజయనగరం

శుక్రవారం । 21 । మార్చి । 2025






**'పొజిషన్' ఉంటేనే ..**
ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతంలో రెండున్నర సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు కేటాయించనుంది. - 8లో



**నిందితులకు రిమాండ్** - 8లో
మెంటాడ మండలం రెల్లిపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు రాళ్లపూడి అంకమ్మను(75) హతమార్చిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



| ఇఫ్తార్ | సహార్ |
|---|---|
| శుక్ర (సా) | శని (ఉ) |
| 6.12 | 4.38 |

**రంజాన్ వేళలు**

## న్యూస్‌రీల్

### దర్బార్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న భక్తులు

**విజయనగరం టౌన్:** పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని బాబామెట్టలోని సూఫీ ఆధ్యాత్మిక చక్రవర్తి ఖాదర్‌బాబా సూఫీ క్షేత్రంలో ఆలయ ధర్మకర్త ఖలీల్‌బాబు సారథ్యంలో గురువారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. విశాఖ నుంచి హాజరైన రవిచంద్ర రవి, ఖలీల్‌బాబు తనయుడు అహ్మద్‌బాబుతో కలిసి ఉపవాస దీక్షాపరులకు ఆత్మీయతతో వడ్డన చేశారు. అనంతరం పరిసర ప్రాంత ప్రజలు, భక్తులకు ఖాదర్‌బాబా వారి అన్న సమారాధనను నిర్వహించారు.

### నూనె గింజల పంటల సాగు పెంచాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న భరతలక్ష్మి

**విజయనగరం ఫోర్ట్:** నూనె గింజల పంటలైన నువ్వు, పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటల సాగు విస్తీర్ణం పెంచాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం సేద్య విభాగ అధిపతి డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ అధికారులకు, విస్తరణ అధికారులకు, వీఏఏలకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నూనె గింజల పంటల్లో కలుపు నివారణకు మార్కెట్‌లో కలుపు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వేరుశనగ పంటలో కదిరి లేపాక్షి, నిత్య వారిత వంటి రకాలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్, శాస్త్రవేత్తలు డాక్టర్ యు.త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

### రెన్యువల్స్ సకాలంలో చేయించుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి

**విజయనగరం ఫోర్ట్:** ఆస్పత్రులు, డయోగ్నోస్టిక్ సెంటర్లు, క్లినిక్స్ సకాలంలో రెన్యువల్స్ చేయించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్ల వైద్యులకు కెపాసిటీ బిల్డింగ్, జనరల్ బేసిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ వెల్లడించకూడదన్నారు. సమావేశంలో అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.రాణి, పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారి డాక్టర్ రెడ్డి అచ్చుతకుమారి, డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, డెమో వి.చిన్నతల్లి, డిప్యూటీ డెమో ఎస్.రమణ పాల్గొన్నారు.

### మారిక హెచ్‌ఎం సస్పెన్షన్

**వేపాడ:** మండలంలోని కరకవలస పంచాయతీ శివారు గిరి శిఖరంపై ఉన్న మారిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యాలనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని అందిన ఫిర్యాదుల మేరకు ఎంఈఓతో విచారణ నిర్వహించారు. అనంతరం సస్పెండ్ చేస్తూ డీఈఓ ఆదేశాలు ఇచ్చారు. సదరు హెచ్‌ఎం స్థానంలో వేరొకరిని నియమించాలని ఎంఈఓకు సూచించారు.

---

ఉల్లాస్.. ఇదో బృహత్తర కార్యక్రమం. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. దీన్ని మూడేళ్ల పాటు విడతల వారీగా నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా జత కలిసింది. తద్వారా మహిళల అక్షరాస్యతను పెంచి సమాజాభివృద్ధిలో వారిని కీలకంగా వ్యవహరించేలా చేయాలని భావించింది. అయితే.. అనుకున్నదొకటి.. జరుగుతున్నది వేరొకటి అనేలా.. ఉంది.

# ఉల్లాస్.. తుస్

- ఎలా రాయాలి? ఏమి రాయాలి?
- అభ్యాసకుల ఆందోళన
- గ్రామాల్లో కానరాని అభ్యసనా తరగతులు
- ఈ నెల 23న పరీక్షల నిర్వహణ
- జిల్లాలో పరీక్షకు హాజరు కానున్న 48,578 మంది
- కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు
- అధికారుల పర్యవేక్షణ కరువు



అభ్యసనా తరగతులు నిర్వహించలేదని తెలుపుతున్న నాయుడువలస డ్వాక్రా మహిళలు

**జిల్లాలో ఇలా..**

| | |
|---|---|
| పరీక్ష కేంద్రాలు | : 875 |
| రాయనున్నవారు | : 48,578 |
| పరీక్ష తేదీ | : 23-03-2025 |
| సమయం | : ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య |

**రామభద్రపురం:**

గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలు ప్రతీ ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమం జిల్లాలో తుస్సుమంది. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఎక్కడా అభ్యసన తరగతులు సక్రమంగా నిర్వహించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దాంతో ఈ నెల 23వ తేదీన జరగనున్న అర్హత పరీక్షలలో ఎలా రాయాలో? ఏమి రాయాలో తెలియని పరిస్థితి వారిలో నెలకొంది. ప్రస్తుత రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు నిరక్షరాస్యత అడ్డంకి రాకూడదన్న ఉద్దేశంతో ఉల్లాస్ పేరుతో పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పని చేస్తున్న మహిళలు, వంట పనివారు, ఆయాలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు, గ్రామైక్య సంఘాల్లో నిరక్షరాస్యత కలిగిన మహిళలకు రాత్రి పూట రెండు గంటల పాటు చదవడం, రాయడం నేర్పించేందుకు అభ్యసన తరగతులు నిర్వహించారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి 1890 మంది చొప్పున్న 48,578 మందిని గుర్తించారు. వీరికి గత ఏడాది డిసెంబర్ 24 నుంచి తొలి విడతగా అభ్యసనా తరగతులు ప్రారంభించారు. వీరిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎక్కువ మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులే. వీరికి బోధించేందుకు ప్రతి పది మందికి ఒకరు చొప్పున్న సంఘంలో విద్యావంతులైన ఒక స్వచ్ఛంద శిక్షకురాలిని నియమించి, రోజుకు రెండు గంటల పాటు ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవనం, ప్రభుత్వ పాఠశాల అవరణలో ఎక్కడో ఒక చోట అభ్యసనా తరగతులు నిర్వహించాలి. అభ్యసనా సామగ్రి కూడా ప్రభుత్వం అందజేసింది. అయితే ఉల్లాస్ కార్యక్రమంలో గ్రామాల్లో అభ్యసనా తరగతులు బాగా జరిగాయా.. సమోదైన మహిళలందరికీ వలంటీర్లు అక్షరాస్యులుగా తీర్చిదిద్దారా.. అని అనుకున్న అధికారులు ప్రాథమిక అక్షరాస్యత పరీక్ష ఈ నెల 23వ తేదీన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తున్నారు. అయితే అధికారులు అక్కడే పప్పులో కాలేశారు. గ్రామాల్లో ఎక్కడా సక్రమంగా అభ్యసనా తరగతులు జరగలేదని.. ఎక్కడో జరిగినా అవి తూతూ మంత్రంగా జరిగాయని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు కూడా ఉల్లాస్ శిక్షణ తరగతులు పర్యవేక్షణ చేయలేదని, పర్యవేక్షించినా చిత్తశుద్ధితో చేయకుండా ఫొటోలకు పోజులిచ్చి వెళ్లిపోయారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం రామభద్రపురం మండలంలోని ఈ చిత్రాలే..

మండలంలోని నాయుడువలస గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు కనీసం ఒక్క రోజూ కూడా అభ్యసన తరగతులు నిర్వహించలేదని, చదువుకునేందుకు ఒక్క పాఠ్యపుస్తకం ఇవ్వలేదని తెలిపారు. ఈ నెల 23వ తేదీన అర్హత పరీక్ష నిర్వహిస్తారని తెలిసిందని, ఆ పరీక్షలలో ఏమి రాయాలో, ఎలా రాయాలో తెలియక ఆందోళనగా ఉందని చెబుతున్నారు. ఇందులో బొర్రా ధనలక్ష్మి, లచ్చిపాత్రుని అప్పలనరసమ్మ, పతివాడ విజయ, ఎర్ర సింహాచలం, ఏంద్రాపు బంగారమ్మ, కేతిరెడ్డి అప్పలరాము తదితరులు ఉన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో అభ్యసనా తరగతుల నిర్వహణకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి పాఠ్య పుస్తకాలు, అభ్యాసకుల హాజరు పట్టికలు ముద్రించింది. ఆ పాఠ్య పుస్తకాలు, హాజరు పట్టికలు పంపిణీ చేయక రామభద్రపురం వెలుగు కార్యాలయంలో మూలన మగ్గుతున్నాయి. మహిళలందరినీ విద్యావంతులు చేయాలన్న కేంద్ర ప్రభుత్వం లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారని, రూ.కోట్లు ఖర్చు పెట్టి ఈ కార్యక్రమం నిర్వహిస్తే అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.



రామభద్రపురం వెలుగు కార్యాలయంలో మూలకు చేరిన ఉల్లాస్ పాఠ్య పుస్తకాలు, హాజరు పట్టికలు

**తరగతులు నిర్వహించారు..**

ఉల్లాస్ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో వలంటీర్లు రోజూ అభ్యసనా తరగతులు నిర్వహించారు. తాను, మా సిబ్బంది పర్యవేక్షించాం. ఫొటోలు కూడా మా ఉన్నతాధికారులకు అప్‌లోడ్ చేశాం. పరీక్షలు రాసే విధంగా అభ్యాసకులను ఈ నెల 23వ తేదీ నాటికి సిద్ధం చేస్తున్నాం.
– కె.అన్నపూర్ణ, వెలుగు ఏపీఎం, రామభద్రపురం

**ఒక్క రోజూ కూడా తరగతులు నిర్వహించలేదు..**



మాది నాయుడువలస గ్రామం. ఇక్కడ ఒక్క రోజు కూడా అభ్యసనా తరగతులు నిర్వహించలేదు. మాకు ఒక్క పాఠ్యపుస్తకం ఇవ్వలేదు. అసలు ఉల్లాస్ కార్యక్రమం గురించే తెలియదు. పరీక్షలు ఎక్కడ పెడతారు? ఏమి రాయాలో.. తెలియదు. అధికారులెవ్వరూ ఒక్క రోజూ కూడా రాలేదు. మమ్మల్ని ఏమి అడగలేదు.
– బొంగు అనసూయ, నిరక్షరాస్యురాలు, నాయుడువలస

---

## నిర్దిష్ట ప్రమాణాల మేరకు పెసర, మినుము కొనుగోళ్లు

- జిల్లాలో ఐదు మండలాల్లో కేంద్రాలు ప్రారంభించిన మార్క్‌ఫెడ్ మేనేజర్



మినుము, పెసర కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు వెంకటేశ్వరరావు తదితరులు

**బొబ్బిలి:** పట్టణంలోని పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు పండించిన పెసలు, మినుము కొనుగోళ్లు చేపట్టి సకాలంలో చెల్లింపులు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని పీఏసీఎస్ కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మినుములు క్వింటా రూ.7,400లు, పెసలు క్వింటా రూ.8,682లకు కొనుగోలు చేస్తామన్నారు. అయితే నాఫెడ్ విధించిన నిర్దిష్ట నాణ్యతా ప్రమాణాల నిబంధనల ప్రకారం పెసలు, మినుములను పై మద్దతు ధరలకు కొనుగోలు చేస్తామన్నారు. ఇందులో మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీగా తన విధులను నిర్వర్తిస్తోందన్నారు. జిల్లాలో జామి మండలం విజినిగిరి, గంట్యాడ, గజపతినగరం, సంతకవిటి, బొబ్బిలి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మిగతా ప్రాంతాల్లో కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు.

**గోదాముల నిర్మాణానికి భూమి కొనుగోలు**

మార్క్‌ఫెడ్ ద్వారా గోదాములను నిర్మించేందుకు బొబ్బిలి గ్రోత్ సెంటర్ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద 5.19 ఎకరాల భూమిని గతంలో కొనుగోలు చేసినట్టు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గొల్లపల్లి సర్వే నంబర్ 509–2లో గల ఈ భూమికి సంబంధించిన రూ.33,73,500 లను రెవెన్యూ శాఖకు చెల్లించామన్నారు. ఇప్పుడు మరోసారి దానిని గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు తహసీల్దార్ ఎం.శ్రీనుతో కలసి సర్వే చేసినట్టు చెప్పారు. పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్ ద్వారా తెలియజేస్తామని చెప్పారు.

## డీఎంసీఎస్‌గా రాజేశ్వరి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీఎంసీఎస్ రాజేశ్వరి

**పార్వతీపురం టౌన్:**

పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్(డీఎంసీఎస్)గా ఐ.రాజేశ్వరి బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఇప్పటివరకు జిల్లా మేనేజర్‌గా కొనసాగిన పి. శ్రీనివాసరావు స్థానంలో ఈమె పదోన్నతిపై ఇక్కడ నియమితులయ్యారు.

## సాయం సంధ్యా సమయం



ప్రకృతి సౌందర్యం ఉట్టిపడేలా.. కల్లుగీత కార్మికుల కష్టాలు తెలిసొచ్చేలా.. కనిపిస్తున్న ఈ చిత్రం విజయనగరం జిల్లా గజపతినగరం రోడ్డులో గురువారం సాయం సంధ్యా సమయాన సాక్షి కెమెరాకు ఇలా చిక్కింది. అస్తమిస్తున్న సూర్యుడి వెలుగులో గీత కార్మికుడు తన బతుకు జీవనానికి బాటలు వేసుకునేలా.. ఈ దృశ్యం చూపరులను ఇట్టే కట్టి పడేసింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

## నిరసన గళం




విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం నిరసన గళం వినిపించారు. 2019లో విజయనగరం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకొచ్చినా నేటికీ సొంత భవనం లేకపోవడంపై విద్యార్థులు నినదించారు. ఇక్కడ కళాశాలలో ఏటా 400 మందికి పైగా విద్యార్థులు కళాశాలలో చేరుతున్నా సొంత భవనం ఏర్పాటు చేయకపోవడంపై మండిపడ్డారు. ఇప్పటికీ సంస్కృత డిగ్రీ కళాశాలలోనే క్లాసులు నిర్వహించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కె.రాజు, అధ్యక్షుడు జి.సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.
– విజయనగరం గంటస్తంభం

## 'అగ్నివీర్'కు దరఖాస్తుల ఆహ్వానం

- ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



**విజయనగరం అర్బన్:** భారత సైన్యంలో అగ్నివీర్ ఉద్యోగాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను వచ్చే నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో joinindianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ద్వారా నమోదు చేసుకున్న అభ్యర్థులు అడ్మిన్‌కార్డును డౌన్‌లోడ్ చేసుకొని ఆర్మీ ర్యాలీ జరిగే తేదీ, సమయం పొందవచ్చునని తెలిపారు. తొలిత ఆన్‌లైన్ పరీక్ష పాసైన అభ్యర్థులకు ఆర్మీ ర్యాలీ (ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్) నిర్వహిస్తారని పేర్కొన్నారు.

**పోస్టుల వివరాలు, విద్యార్హతలు**

**అగ్నివీర్ జనరల్ డ్యూటీ:** 10వ తరగతిలో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

**అగ్నివీర్ టెక్నికల్:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ మరియు ఇంగ్లిష్ సబ్జెక్టులతో కనీసం 50 శాతంతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ప్రతి సబ్జెక్టులో కనీసం 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి.

**అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్:**
ఆర్ట్స్, కామర్స్, సైన్స్ సబ్జెక్టులతో కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు ప్రతి సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

**అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్:**
8వ/10వ తరగతి ఉత్తీర్ణత. అభ్యర్థులు 2004 అక్టోబర్ 1 నుంచి 2008 ఏప్రిల్1వ తేదీ మధ్య జన్మించి ఉండాలి.

**శరీర కొలతలు**

అగ్నివీర్ జనరల్ డ్యూటీ మరియు అగ్ని ట్రేడ్స్ మెన్ పోస్టులకు 166 సెంటీమీటర్లు ఎత్తు ఉండాలి. అగ్నివీర్ టెక్నికల్ పోస్టుకు 165 సెంటీమీటర్లు, అగ్నివీర్ క్లర్క్/టెక్నికల్ పోస్టులకు 162 సెంటీమీటర్లు ఎత్తు తప్పనిసరి. 77 సెంటీమీటర్ల కనీస విస్తీర్ణంతో ఛాతీ ఉండి ఊపిరి పీల్చేటప్పుడు 5 సెంటీమీటర్ల విస్తీర్ణం పెరగాలి. ఎత్తుకు తగిన బరువు కలిగి ఉండాలి. ఎంపికైన వారిని 4 సంవత్సరాల షార్ట్ టర్మ్ సర్వీసు అగ్నివీర్ సర్వీస్‌లోనికి తీసుకుంటారు. దళారులు, మధ్యవర్తులను నమ్మవద్దని ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఆర్మీ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతుందని కలెక్టర్ అంబేడ్కర్ స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం సెట్విజ్ కార్యాలయంలోని మేనేజర్ వెంకటరమణ 9849913080 నంబరుకు సంప్రదించాలని ఆయన సూచించారు.

---

## మీటర్ రీడింగ్ కార్మికుల పొట్ట కొట్టొద్దు..

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్



విద్యుత్ భవన్ ఎదుట నిరసన చేపడుతున్న మీటర్ రీడర్స్

**విజయనగరం గంటస్తంభం:** స్మార్ట్‌మీటర్లు తీసుకొచ్చి వేలాది మంది విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే కార్మికుల పొట్ట కొట్టొద్దని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. గురువారం స్థానిక దాసన్నపేటలోని విద్యుత్ భవన్ ముందు మీటర్ రీడర్స్ యూనియన్ సభ్యులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో సుమారు 4500 మంది విద్యుత్ మీటర్ రీడర్స్ 20 సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో కార్మికులందరికీ అన్యాయం జరుగుతుందని చెప్పారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించి.. నేడు బీజేపీతో జత కట్టడం సిగ్గుచేటన్నారు. ఒక్కో సర్వీస్‌కు కేవలం రూ.3.60 పీస్ రేటుతో నెలకు రూ. 6 నుంచి 10 వేల రూపాయల లోపు మాత్రమే వేతనం పొందుతున్న రీడర్స్‌ను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. మీటర్ రీడర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఆందోళనలను ఉధృతం చేస్తామని చెప్పారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, పసుమర్తి శ్రీకాంత్, (ఎస్.కోట సబ్ డివిజన్), విజయనగరం సబ్ డివిజన్ గోక రమణ, (గజపతినగరం సబ్ డివిజన్) ఆది, రీడింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## వేసవి ప్రారంభంలోనే ప్రమాద ఘంటికలు

- తగ్గుతున్న జలాశయాల నీటి మట్టాలు

**బొబ్బిలి:**

అన్నదాతకు, అటు మూగ జీవులు, ప్రజానీకానికి దాహార్తిని తీర్చే జలాశయాలు నీటి నిల్వలను మార్చి నెలలోనే కోల్పోవడం కనిపిస్తోంది. జిల్లాలోని ప్రధాన జలాశయాల నీటి మట్టాలు తగ్గుముఖం పట్టే ఛాయలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని నీటి మట్టాలు తగ్గుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రబీకి సాగునీరు ఇచ్చే పరిస్థితి లేకపోయినా చాలా చోట్ల పశువుల దాహార్తిని తీర్చేందుకు, ఆరుతడి పంటలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందా.. అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న సాగునీటి వనరుల్లో ఒక భారీ తరహా నీటి పారుదల ప్రాజెక్టు ఉండగా మిగతావి మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులున్నాయి. వీటి ద్వారా ఏటా ఖరీఫ్‌లోనే సాగు నీటిని విడుదల చేస్తున్నారు. రబీలో ఆరుతడి పంటలకు సాగునీటిని విడుదల చేసే అవకాశం ఉంటోంది. వీటిని ఏటా జలవనరుల శాఖ అధికారులు పరిశీలించి రబీకి సాగునీటిని విడుదల చేయాలా.. వద్దా.. అనేది నిర్ణయిస్తారు. దీని ప్రకారం రైతులు తమ పంటలను సాగు చేసుకుంటుంటారు. అయితే ఈ ఏడాది సాగునీటి నిల్వలు తగ్గే పరిస్థితి నెలకొంది. మార్చి నెలలోనే సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు మీటర్ల మేర తగ్గుతూ కనిపిస్తోంది. వేసవిలో అకాల వర్షాలు, తుఫాన్ల వంటివి సంభవిస్తే తప్ప మే నెలాఖరుకు మరింత నీరు ఇంకిపోయే పరిస్థితులున్నాయి. ఇది అందరినీ కలవరపరుస్తోంది.

**జిల్లాలోని జలాశయాల్లో ఉన్న నీరు, వాటి పూర్తి స్థాయి సామర్థ్యాలు**

| జలాశయం | పూర్తి స్థాయి నీటి మట్టం | గురువారం నీటి మట్టం |
|---|---|---|
| తోటపల్లి | 105.00 | 102.53 |
| జంఝావతి(డైవర్షన్) | 122.90 | 122.90 |
| పెదంకలాం(డైవర్షన్) | 00000 | 00000 |
| వట్టిగెడ్డ | 121.62 | 111.86 |
| పెద్దగెడ్డ | 213.80 | 211.05 |
| వీఆర్ఎస్ | 161.00 | 159.10 |



వీఆర్ఎస్‌లో కొద్ది రోజుల కిందటి నీటి నిల్వలు

## క్లుప్తంగా

### గేట్‌లో ఆలిండియా 451వ ర్యాంక్

• అర్తమూరు యువకుడి ప్రతిభ


గేట్‌లో సత్తా చాటిన నరసింహనాయుడు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన గేట్ –2025 (గ్రాడ్యుయేట్ యాప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్)ఎంట్రన్స్ టెస్ట్‌లో గరివిడి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన యువకుడు సుంకరి నరసింహనాయుడు ప్రతిభ చాటాడు. మెకానికల్ విభాగంలో ఆలిండియా స్థాయిలో 451వ ర్యాంకు సాధించాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న గేట్ ఎంట్రన్ పరీక్ష జరగ్గా బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి.

### తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు


తల్లిదండ్రులకు అప్పగించిన శివసాయితో ఎస్సై రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: మండలంలోని రావివలస ఎస్సీ వసతి గృహంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి పత్తిగూల శివసాయిని స్థానిక ఎస్సై పి.రమేష్‌నాయుడు గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన శివసాయి ఫిబ్రవరి 17న రావివలస ఎస్సీ వసతి గృహంనుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు తండ్రి పోలయ్య ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. శివసాయి కోసం గాలింపు చేపట్టగా సీతానగరం మండలం అంటిపేటవద్ద ఆచూకీ లభించడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి, తల్లిదండ్రులకు ఎస్సై అప్పగించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఎస్సైకి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఈహెచ్‌ఎస్ సేవలందించడంలో అలసత్వం తగదు

• ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ డి.రాంబాబు


ఆస్పత్రిలో మహిళతో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ రాంబాబు

విజయనగరం ఫోర్ట్: ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)కు సంబంధించి ప్రతి రోగికి వైద్యసేవలు అందించాలి. వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్యసేవ) జిల్లా మేనేజర్ డి.రాంబాబు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ నెట్‌వర్క్ ఆస్పత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్యసేవల గురించి ఆరా తీశారు. చికిత్స సకాలంలో అందిస్తున్నారా? నాణ్యమైన భోజనం పెడుతున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదనంగా డబ్బులు ఏమైనా అడుతున్నారా అని రోగులను ఆరా తీశారు. ఆస్పత్రిలో ఏ సమస్య ఉన్నా వెంటనే ఆరోగ్య మిత్రను కలవాలని రోగులకు చెప్పారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ ఎ.భానుప్రసాద్ పాల్గొన్నారు.

### అట్రాసిటి కేసుపై విచారణ


ఫిర్యాదుదారురాలు కృష్ణమ్మ ఇంటివద్ద ఆరా తీస్తున్న డీఎస్పీ మీరాకుమార్

వేపాడ: మండలంలోని గుడివాడ గ్రామానికి సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై విజయనగరం డీఎస్పీ మీరాకుమార్ నేతృత్వంలో గురువారం విచారణ చేపట్టారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. మార్చి 11న గుడివాడలో వేణుగోపాలస్వామి తీర్థం సందర్భంగా నిర్వహించిన డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ వద్ద జరిగిన గొడవలో తన కుమారుడిని కులం పేరుతో వల్లంపూడి ఎస్సై బి.దేవి దూషించి గాయపర్చినట్లు గ్రామానికి చెందిన గుడివాడ కృష్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ పి.మీరాకుమార్, రూరల్ సీఐ అప్పలనాయుడు గ్రామంలో గురువారం విచారణ నిమిత్తం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ వద్దకు ఫిర్యాదుదారు కృష్ణమ్మ హాజరుకాకపోవడంతో డీఎస్పీ మీరాకుమార్ ఫిర్యాదు దారు ఇంటికి వెళ్లి ఆరా తీయగా కుటుంబసభ్యులు ఉన్నారు కానీ ఫిర్యాదుదారు లేకపోవడంతో గ్రామసభకు చేరుకున్నారు. గ్రామసభలో వేచి ఉన్నప్పటికీ సాక్షులు హాజరుకాకపోవడంతో సర్పంచ్ మిడతాన గోపి, ఏపీ దళితకూలీ రైతు సంఘం నాయకుడు గాలి ఈశ్వర్రావు తదితరులతో మాట్లాడిన అనంతరం డీఎస్పీ, సీఐ వెనుదిరిగారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹107 | ₹184 | ₹194 |

# పొజిషన్ ఉంటేనే నిధుల మంజూరు..!

• హౌసింగ్ నిధులు ఒక్కో లబ్ధిదారుకు రూ.2.50లక్షలకు పెంపు
• కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు పొజిషన్ సర్టిఫికెట్ తప్పనిసరి
• తలలు పట్టుకుంటున్న ఇళ్ల లబ్ధిదారులు


గుమ్మలక్ష్మీపురం మండలంలో సర్వే చేస్తున్న సచివాలయం సిబ్బంది

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్‌టీఆర్ హౌసింగ్ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతంలో రెండున్నర సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు కేటాయించనుంది. హౌసింగ్‌లో వచ్చే నిధులను ఒక్కో లబ్ధిదారుకు రూ.2.50లక్షలకు పెంచినట్లు పక్క ప్రభుత్వం, మరోపక్క అధికారులు చెబుతున్నారు. వాటికి తోడు బీసీ, ఎస్సీ కులాల లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు, ఎస్టీ కులాలకు చెందిన లబ్ధిదారులకు అదనంగా రూ.70వేలు ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ క్రమంలో హౌసింగ్ పథకం అమలు వేగం పుంజుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంతా ఒక ఎత్తయితే హౌసింగ్ పథకంలో బీసీ, ఎస్సీ,ఎస్టీ కులాల ధ్రువీకరణ పత్రాలు, వారి అనుభవంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ అధికారులతో పొజిషన్ సర్టిఫికెట్లు జతచేయాలన్న నిబంధన పెట్టారు. దీంతో లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు స్థలాల పొజిషన్ సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో లబ్ధిదారులకు ఇబ్బందులు రావడం లేదు కానీ పొజిషన్ సర్టిఫికెట్ మంజూరులో రెవెన్యూ అధికారులు పలు ప్రశ్నలు వేస్తున్నారు. స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్, అగ్రిమెంట్లు ఉండాలని, డీకేటీ, గ్రామకంఠం భూములకు ఇవ్వమని చెబుతున్నారు. గ్రామాల్లో పేద రైతులకు వారి పొలాల వద్ద హౌసింగ్ ఇంటి నిర్మాణానికి స్థలాలు ఉన్న భూములకు వన్‌బీ ఉండడంతో మూడు సెంట్ల స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్లు ఎలా ఇస్తామని రెవెన్యూ అధికారులు మెలిక పెడుతున్నారు. దీంతో లబ్ధిదారులు తమ గోడు ఎవరికీ చెప్పుకోవాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### గందరగోళంలో హౌసింగ్ అధికారులు

పార్వతీపురం మన్యం జిల్లాలో హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి. ప్రతి వారం రోజులకు ఈ పథకంలో సాధించిన నివేదికలు ఇవ్వండి అంటూ హౌసింగ్ ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారుల వెంట పడుతున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే ఈ పాటికే హౌసింగ్ నిర్మాణాలు పునాదులు దాటి గోడస్థాయికి వచ్చి ఉండేవి. కానీ లబ్ధిదారుల సొంత స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్ ఉంటేనే నిధులు మంజూరు చేయాలనే నిబంధన ఉండడంతో ఇక్కడే ఈ పథకం ముందుకు కదలకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. దీంతో ఉన్నతాధికారులకు సమాధానాలు చెప్పలేక, రెవెన్యూ అధికారులను ప్రాథేయపడలేక హౌసింగ్ అధికారుల్లో గందరగోళం నెలకొంది.

#### జిల్లాలో 18,056 మంది లబ్ధిదారుల గుర్తింపు

పార్వతీపురం మన్యం జిల్లాలో 18,056 మంది హౌసింగ్ పథకంలో లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు సర్వే చేశారు. సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు హౌసింగ్ పథకంలో ఇంటి నిర్మాణం మంజూరు చేసేందుకు ఆ స్థలాల్లో పొజిషన్ సర్టిఫికెట్ల మెలిక పెట్టడంతో అవి నిలిచిపోతున్నాయి. జిల్లాలో గల 15 మండలాల్లో అధికారులు విస్తృతంగా సర్వే నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి. సుమారు 13వేల మందికి పైగా లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు లేవన్న కారణంగా హౌసింగ్ బిల్లులు అందుతాయో? లేదోనన్న ఆందోళన నెలకొంది.

#### అన్ని ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

హౌసింగ్ పథకంలో భాగంగా సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్ తప్పనిసరి. సొంత స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేస్తున్నారు. ఆధాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తేనే లబ్ధిదారులకు హౌసింగ్ నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తున్నాం.

– పి.ధర్మ చంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

# నిందితులకు రిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

• వృద్ధురాలిని హతమార్చిన కేసులో నలుగురి అరెస్ట్

గజపతినగరం: మెంటాడ మండలం రెల్లిపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు రాళ్లపూడి అంకమ్మను(75) హతమార్చిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం గజపతినగరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మెంటాడ మండలం రెల్లిపేటలో తన నివాస గృహంలో 16.3.2025న వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు. శవపంచనామా అనంతరం వృద్ధురాలిని గొంతునులిమి చంపినట్లు వైద్యుల రిపోర్టు రావడంతో ఎస్పీ ఆదేశాల మేరకు నిందితులను గాలించి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. గురువారం ఉదయం 11గంటలకు నలుగురు నిందితులైన దానాల రాము, దానాల దుర్గారావు, దానాల రాములమ్మ, పాల్తేటి రామప్పడు అలియాస్ బొడ్డులు పంచాయతీ సెక్రటరీ, వీఆర్‌ఓల సమక్షంలో లొంగిపోయినట్లు చెప్పారు. మృతురాలు అంకమ్మ ఇంటి చుట్టుపక్కల ఉన్న వారికి నగదు అప్పుగా ఇస్తూ ఉంటుందని అందులో భాగంగా దానాల రాములమ్మ అప్పుఅడగ్గా ఆమె తిరస్కరించింది. దీంతో రాములమ్మతో పాటు మరో ముగ్గురు తోడై వృద్ధురాలి వద్ద ఉన్న బంగారం ముక్కుపుడక, రూ.740లు దోచుకుని ఆమెను హతమార్చినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన స్థానిక సీఐ జీఏవీ రమణ, ఆండ్ర ఎస్సై కె.సీతారామ్, గజపతినగరం ఎస్సై కె.లక్ష్మణరావుల తో పాటు ఇతర సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్‌తో పాటు తాను అభినందిస్తున్నట్లు చెప్పారు.

## ఆధునిక పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు

• జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు
• వర్సిటీలో మెక్‌అనో జాతీయ సదస్సు ప్రారంభం

విజయనగరం అర్బన్: పరిశ్రమ రంగానికి అవసరమైన ఆధునిక పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా స్టూడెంట్ చాప్టర్ సంయుక్త నిర్వహణలో 'మెక్ అనో ఎంఎంఎక్స్ ఎక్స్‌వీ 2025' అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరికరాలు అవి పని చేస్తున్న తీరు తదితర అంశాలపై పరిజ్ఞానాన్ని పెంచడానికి ఇలాంటి సదస్సులు విద్యార్థులకు దోహదపడతాయన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాస్ ప్రసాద్, వి.మణికుమార్, డాక్టర్ సి.నీలిమదేవి ఫ్యాకల్టీ సమన్వయకర్తలుగా,, స్టూడెంట్ కో ఆర్డినేటర్స్‌గా కె.కౌశిక్, పి.ప్రగతి వ్యవహరించారు.

## ఇద్దరికి గాయాలు


ప్రమాదం జరిగిన ప్రదేశంలో నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం, పక్కన కర్రల లోడ్‌తో ట్రాక్టర్

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురంలో బుధవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తాలాడ గ్రామానికి చెందిన వంకల రాజారావు, సిరిపురం గ్రామానికి చెందిన గుణుపూర్ గోవింద, శంకరపేట గ్రామానికి చెందిన కోరాడ రాజులు ఇదే మండలంలోని మల్లయ్యపేట గ్రామంలో కూలి పనులకు వెళ్లి పనులు ముగించిన అనంతరం గుళ్లసీతారాపురంలో లైఫ్‌ఫిష్ సెంటర్లో చేపలు కొని అయ్యప్ప టెంపుల్ దగ్గర బైక్‌తో ఆగి ఉన్నారు. ఆ సమయంలో కర్రల లోడ్‌తో ట్రాక్టర్ వేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వంకల రాజారావు, గుణుపూర్ గోవిందలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు 108 ద్వారా రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. వంకల రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

## పోక్సో కేసుల్లో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకోవద్దు


ఖైదీల నుద్దేశించి ప్రసంగిస్తున్న న్యాయమూర్తి అరుణశ్రీ

బొబ్బిలి: పోక్సో కేసుల్లో ఇరుక్కుని మీ జీవితాలు నాశనం చేసుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ హితవు పలికారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్‌జైలును ఆమె సందర్శించి రిమాండ్ ఖైదీలతో మాట్లాడి సత్ప్రవర్తనపై తెలియజేశారు. న్యాయ సహాయం కావాల్సిన వారు ఏ విధంగా పొందవచ్చో వివరించారు. చెడు ఆలోచనల వల్ల ఎలాంటి ఉపద్రవాలు ఎదుర్కోవాల్సి వస్తుందో, వాటికి దూరంగా ఉంటూ సమాజంలో మంచి పౌరులుగా ఎలా జీవించాలోనన్న విషయాలను తెలియపర్చి వారిలో పరివర్తన, చైతన్యం కల్పించే ప్రయత్నం చేశారు. సబ్‌జైలర్ పాత్రో, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రెండు గడ్డివాములు దగ్ధం

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో కర్రి అప్పలనాయుడికి చెందిన రెండు గడ్డివాములు గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. పశువులకు ఏడాదికి సరిపోయే గడ్డిని సమకూర్చుకున్నానని, అగ్ని ప్రమాదంలో గడ్డి మొత్తం కాలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తంచేశాడు. గడ్డివాములు కాలిపోతున్న విషయమై స్థానికులు బాడంగి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.10వేల నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

## గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

• విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి


డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గంజాయిని ధ్వంసం చేయిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణాపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతోందని విశాఖ రేంజ్ పోలీసు డీఐజీ గోపీనాథ్ జెట్టి స్పష్టం చేశారు. ఈ మేరకు గడిచిన ఎనిమిది నెలల్లో మూడు దశల్లో పట్టుబడిన 7 వేల 378 కేజీల గంజాయిని ధ్వంసం చేశామని డీఐజీ తెలిపారు. విశాఖ పోలీస్ రేంజ్ పరిధి శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాతకుంకాంలో గురువారం మూడు జిల్లాల్లో పలు కేసుల్లో సీజ్ చేసిన గంజాయి నిర్మూలన కార్యక్రమం జరిగింది. 226 కేసులలో సీజ్ చేసిన 7378 కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, ,శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.


## దైవదర్శనానికి వెళ్తూ ఇద్దరు మహిళల మృతి


రౌతు సూరప్పమ్మ (ఫైల్)


అప్పలనారాయణమ్మ (ఫైల్)

గుర్ల: మండలంలోని పెనుబర్తికి చెందిన 15 మంది, గరివిడి మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన 30 మంది తమిళనాడులోని రామేశ్వరం దైవదర్శనానికి బస్సులో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. తెలంగాణలోని మెదక్ జిల్లా శంకరంపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదం వివరాలిలా ఉన్నాయి. రోడ్డు పక్కన ఆగి ఉన్న ప్రయాణికుల బస్సును డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి బస్సు వెనుక భాగంలో ఉన్న కూర్చున్న మహిళలు మృతిచెందారు. మృతిచెందిన వారిలో గుర్ల మండలంలోని పెనుబర్తికి చెందిన రౌతు సూరప్పమ్మ (60), గరివిడి మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన మీసాల అప్పలనారాయణమ్మ (50) ఉన్నారు. అలాగే పెనుబర్తి గ్రామానికి చెందిన బెల్లాన జగన్నాథం, సుంకరి రామలక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి.

#### బావిలో పడి ఒకరు...


మజ్జి సత్యనారాయణ (ఫైల్)

పార్వతీపురం రూరల్: రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి నేలబావిలో శవమై తేలాడు. ఈ మేరకు స్థానిక రూరల్ ఎస్సై బి.సంతోషి గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సారిక వీధికి చెందిన మజ్జి సత్యనారాయణ(54)ఈనెల 18న ఆస్పత్రికి అని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తరువాత ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు పరిసర గ్రామాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు భార్య పార్వతి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం పార్వతీపురం రూరల్ పరిధిలో ఉన్న బ్యాంక్‌ఆఫ్ బరోడా సమీపంలో నేలబావిలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మృతదేహాన్ని సత్యనారాయణగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నాలుగు నెలల క్రితం కుటుంబ సభ్యులలో ఒకరు మరణించడంతో మనస్తాపానికి గురై సత్యనారాయణ మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### బాలికల ఉన్నత పాఠశాలలో 'సునీత' విజయోత్సవాలు


సునీత విలియమ్స్ విజయోత్సవాల్లో బాలికలు, ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: అంతరిక్షం నుంచి సునీత విలియమ్స్ క్షేమంగా చేరుకున్న సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విజయోత్సవాలు ఘనంగా జరిగాయి. తొలుత పాఠశాల ప్రాంగణంలో బాలికలు సామూహిక ప్రదర్శన చేసి బాణసంచా కాలుస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పి.రమణమ్మ మాట్లాడుతూ యువత సునీత విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బాలికల్లో స్ఫూర్తిని పెంచే విధంగా ఆమె చూపిన పట్టుదల, దృఢ సంకల్పం నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.వెంకట్రావు, ఈ.రాము నాయుడు, పి.ఉమారాణి, ఎంవీ లక్ష్మీనరసమ్మ, సీహెచ్‌రత్నం, యూవీఏఎస్ రాజు, శ్రీరంగాచార్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటను వల్లంపూడి పోలీసులు గుర్తించి ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం సాయంత్రం అందిన సమాచారం మేరకు పోలీసులు నిర్వహించిన దాడుల్లో గ్రామసమీపంలోని తోటల్లో 500 లీటర్ల బెల్లం ఊట పట్టుబడింది. దీంతో బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

# ఆదుకోకోంటే ఉద్యమమే


విజయరాయిలో నిర్వహించిన కోకో రైతుల రాష్ట్ర సదస్సులో చేయి కలిపిన రైతులు

• తేల్చిచెప్పిన కోకో రైతులు
• కొనుగోలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్
• విజయరాయిలో రాష్ట్ర సదస్సుకు పెద్దసంఖ్యలో రైతుల హాజరు

పెదవేగి: కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కోకో రైతుల రాష్ట్ర సదస్సు హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. బొల్లు రామకృష్ణ, బోళ్ల సుబ్బారావు, ఈడ్పుగంటి శ్రీనివాసరావు అధ్యక్షులుగా వ్యవహరించిన ఈ సదస్సులో కోకో రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కోకో రైతులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

#### కంపెనీల సిండికేట్‌తో దోపిడీ

కోకో గింజల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకొని కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కోకో తోటల సాగు ఉందని, ఏలూరు జిల్లాతో పాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.


రాష్ట్ర నలుమూలల నుంచి సదస్సులో పాల్గొన్న రైతులు

#### కోకో రైతులు సంఘటితం కావాలి

కోకో రైతులంతా సంఘటితంగా లేకపోవడం వల్లే కంపెనీలు సిండికేట్ అయి ఇబ్బంది పెడుతున్నాయని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు.

#### 24న ధర్నాలు, రాస్తారోకోలు

కోకో రైతుల సమస్యలపై ఈ నెల 24, 25 తేదీల్లో ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించాలని, ఎంపీలు ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు వినతి పత్రాలు అందించాలని, సమస్యను పరిష్కరించకపోతే కోకో గింజలు కొనుగోలు చేస్తున్న కంపెనీల గొడౌన్ల ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోకో రైతుల రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది.


సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
■ 6 లక్షలకే 111 గజాల స్థలం, GVMC పరిధి లేఅవుట్‌లో 30 బిట్లు కలవు. చుట్టూ ఇల్లులు, షాపులు, మార్కెట్ అన్ని సౌకర్యాలు. EMI కలదు. ఫోన్ : 80196 24319 [V- 823977]

SERVICES
■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపారం రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPAవారు కూడా సలహాల కొరకు సంప్రదించండి. పార్థిబా, 9121625779. [T-314]

WANTED
■ ఉద్యోగ అవకాశం విజయనగరం లోకల్ గోల్డెన్ వెంచర్స్ వారి నూతన హౌసింగ్ ప్రాజెక్టు మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు టెలీకాలర్స్ 5, మార్కెటింగ్ మిత్రులు 10, అకౌంటెంట్ 1, టీం ఉన్న లీడర్‌కు మంచి ప్రాధాన్యం కలదు. మంచి జీతం, భోజనం, కమీషన్. అనుభవం లేని వారికి ట్రైనింగ్ ఇవ్వబడును. 7569325969, 8688796746 [SCA 25002253]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [SCA 25002218]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం: 12,000. సంప్ర॥ 80084 01243. [V- 6691]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD. 7995365999 [HA-141]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.